బైదిబై రక్కుకుంటారు. గిల్లుకుంటారు. అఫ్‌కోర్స్... శోషల్ జస్టిస్ వుండాలండీ! అమ్మ-పని ముండ ఎగేసింది. గంపెడు అంట్లున్నాయ్ చచ్చాంరా దేవుడా చెరోగిన్నె తోముకుందాం వస్తారా రారూ? పోనీ మీరు చింతపండంటించండి నేను పొయ్యి బూడిత్తో కొబ్బరి పీసెట్టి బరబరా బరికేస్తాను. వినపడ్డం లేదా. చెవుడా? మరో ప్రపంచం పిలిచిందా-పిలుస్తుంది పిలుస్తుంది సెల్ఫ్ హెల్ఫ్ యీజ్ ది బెస్ట్ హెల్పన్నాడు ఇంగ్లీషు వాడు. ఇదిమరో ప్రపంచం కాదా! ఆల్‌రైట్ - గో గో గో యట్వాన్స్ మైబోయ్ చింతపండు పట్టించటం కూడా రాని మహా పురుషులున్నా రండీ యీ లోకంలో - అందులో మన కంట్రీలో మన యింట్లో.... చెప్పండి. సోషలిజం ఎలా వస్తుంది? మనలో వున్న సోషలిజాన్ని బయటకు తరమకుండా వుంటే మంచిదేమో! ఏవో కూశానుగాని యీ మాటెవరికీ బోధపడి చావదు. ఈ బాత్రూంలో బల్బు కూడా సరిగా వెలిగి చావదని గత సంచికలో చెప్పానను కుంటాను. ఇప్పుడీగిన్నెల్ని బాల్చీ అనుకుని బాల్చీని గిన్నెలనుకుని తన్నేస్తే నాగతి ఏం కాను?

## బంకం ప్రిన్సిపుల్ (అను ఒక తలతిక్క సిద్ధాంతము)

కలకత్తా ఆంధ్ర సంఘం వారి సూవెనీర్ తిరిగేస్తూంటే బంకం ప్రిన్సిపులని ఒక వ్యాసం కనపడింది. బంక అంటే వ్హాట్ సార్ అని మా ఎన్‌సైక్లోపీడియా గార్నడిగాను. ఎందుకంటే ప్రతి ఆడదానికి మొగుడే అట్లాసూ. మొగుడే ఎన్‌సైక్లోపీడియా, అతగాడే డిక్షనరీ ఆ మహాపురుషుడే విజ్ఞాన సర్వస్వమూ అనాలి గనుక. మొగుడ్ని కాకుండా మరోకర్నె వరినైనా విజ్ఞాన కోశమని భావించి డవుట్లు అడిగితే మెడట్టుకు వీధిలోకి గెంటేస్తారు, ఛీ-ఛో...కులటా అంటూ, పాతివ్రత్యం రూల్సన్నీ పాటించినా అజ్ఞానానికి తలవంచుగుని మా బ్రహ్మదేవుడ్ని మళ్ళీ ప్రశ్నించాను బంక అంటే ఏవిటనీ.

బంకం అంటే నాన్సెన్సుట. మరైతే నాన్సెన్స్‌కి రూల్సు ఏవిటండీ అన్నాను. కాదేమొద్దూ అదో ప్రిన్సిపులనగా సూత్రం అన్నారు. అదేదో ఆ బంకసూత్ర మంటే ఏవిటో తెలుసుకోవాలని చెడ్డ తహ తహగా వుందండీ అంటే ఫుంటుందుంటుంది తగ్గవే భామా అన్నారు మొహం చిట్లించి. మొహం చిట్లించినపుడు మొగాళ్ళు (మనలా) బావుండరు.

మనం మంగళ సూత్రాల తాలూకు సూత్రాలు పెరిగిపోయినపుడు కొత్త తాడు పేనుకుంటామా లేదా? ఆల్‌రైటు అలాగే పాత సూత్రాలు పనిచేయనపుడు సాంప్రదాయాన్ని ప్రక్కకు నెట్టి కొత్త సూత్రాలను వెతుక్కుని ఆశ్రయించాలిట. మనం లేడీస్కదా - మనది మట్టి బుర్ర కదా సహజంగా అందుకని మళ్ళీ అడిగాను, బుర్ర తక్కువ వాళ్ళం కదా అడిగితే తప్పేం వుందని.

స్టాటిస్టిక్సంటే తెల్సా సుందరీ అన్నారు. చెప్పండి ఒకటి తెలిసి చచ్చింది గనుకనా అన్నాను. మన ఊళ్లో ఎన్ని కాకులున్నాయి చెప్పు -నాకు తెలీద్సార్, చచ్చినంతొట్టు సరస్వత్తోడన్నాను. ఈ చేటలో వున్న బియ్యపు గింజల్ని లెక్క పెట్టగలవా అన్నారు. యిదా సరసం అన్నాను. సరసం కాదు యిదే స్టాటిస్టిక్సంటారు. ఈ కాకుల్లెక్కలన్నీ శుద్ధ దండగ. ప్రాణం మీదకొస్తే యివేమీ పని చేయవు అనే సూత్రమ్ బంకం ప్రిన్సిపులంటార్ట. ఎమర్జన్సీలో పనికిరాని సూత్రాలన్నీ ప్రక్కన పెట్టమన్నారు. ఇంకా తెలిసి చావలేదండీ యీ బంకం సూత్రమేవిటో... వరస చూస్తే మీ బుర్రకే అది ఎక్కినట్లు కనపడ్డం లేదన్నాను. చెంగు చాటు చేసుకుని నవ్వుతూ. ఇహ్హీహీ అని మొగం మీద మొగం పెట్టి మనం ఆడాళ్ళం నవ్వ కూడదు. వెనుకటిరోజుల్లో అయితే పళ్ళురాలగొడ్తారు. ఈ కొంగుచాటు చేసుకుని నవ్వడం - అదో తరహా. బ్యూటీకి బ్యూటీ, దెబ్బకి దెబ్బ. మనం కొంచెం పక్కకు తిరిగి నవ్వితే భర్తలు అయిసయి పోతారు. కొందరు కుళ్ళి కుళ్లి లోపల్లోపల ఏడ్చుకుంటారు. మీరు రిక్షాలో కూర్చున్నప్పుడు మీ వారిని కొంచెం గిల్లండి పుటిక్కున చలిచీమలా - అబ్బ ఏదో కుడుతోందే అని ఆ మహాకాయుడు లేస్తాడు. అప్పుడు మీరు చక్కగా సర్దుకుని కూర్చుని నాకేమీ కుట్టలేదే అని ఆశ్చర్యాన్నభినయించండి. దట్సాల్ - మిమ్మల్ని మీరు గిల్లుకోరు కదా - అది అసాధారణ పరిస్థితి గనుక రోజూ యింట్లో గిల్లని గిరిజాకుమారి భర్తను రిక్షాలో గిల్లి సర్దుకు కూర్చోటం బంకం ప్రిన్సిపుల్ కింద వస్తుందా రాదా అని ఆలోచిస్తున్నాను.

సాధారణంగా పార్టీ నిలబెట్టిన అభ్యర్థికి ఆ పార్టీ మెంబర్లు ఓట్లు వేస్తారు. పార్టీ నిలబెట్టిన వ్యక్తిని కాదని గిరిగారికి అందరూ ఓట్లు వేస్తారా లేదా అంతరాత్మ చెప్పినట్లువిని, ఇలా అంతరాత్మ చెప్పినట్లు వినడం బంకం ప్రిన్సిపులే. సాధారణంగా పనిచేసే సూత్రం ఎమర్జన్సీలో పనికి రాదని కదా శాస్త్రకారుడి వాక్కు.

మీ వద్దనొక తాళం చెవుల గుత్తి వుంది. ఒక డ్రాయరు సొరుగు తెరవాలి, నీ తాళం చెవితో అది తెరుచుకుంటుందో లేదో మీకు తెలియదు. ఆ తాళం చెవుల గుత్తిలో మాటవరసకు ఎనిమిది తాళం చెవులున్నాయనుకుందాము. ఒకటి రెండు మూడు నాలుగు తాళంచెవుల నుపయోగిస్తే నూటికి యాభై వంతులు సొరుగును తెరిచే అవకాశం వుందని పాత స్టాటిస్టిక్సు ప్రకారం ఊహించవచ్చు. ఇలా ఓపిగ్గా తాళంచెవి తరవాత తాళం చెవి ప్రయోగిస్తే ఎప్పటికో ఓ అప్పటికి సొరుగును తెరవటం సాధ్యమవుతుంది.

కానీ మీరు చాలా అర్జంటు పనిలో వున్నారు. ఒక పేరంటానికెళ్ళాలి. బీరువాతాళం చెవులు మీవారి కోటుజేబులో వుండిపోయాయి. ఫోన్‌చేస్తే మీ వారు ఆఫీసుబోయిచేత తాళం చెవులు పంపించారు. అవి బీరువా తాళంచెవులవునో కాదో మీకు తెలీదు. ఇంతలో మీ పెద్దపిల్ల జడ వేయమంటూ వస్తుంది, చంటిపిల్ల కేక్కంటుంది. లాండరీనుంచి వుతికిన బట్టలొచ్చాయి. పక్కింటి పిన్నిగారువచ్చి అయిదు రూపాయలుంటే యిమ్మని చేబదులడిగింది. ఇంతలో మీ తమ్ముడు రాకరాక "అక్కా" అంటూ అప్పుడే వచ్చాడు రిక్షాలోదిగి. బీరువా

తెరవాలి. బీరువాతో చాలా పనివుంది. ఈ గుత్తి లోకూడా ఎనిమిదో తాళం చెవితో తెరుచు కుంటుంది బీరువా తలుపు. ఎనిమిదో తాళం చెవి వుపయోగిస్తే 50 వంతులు బీరువా తెరుచుకోవచ్చు. తప్పితే మిగతా ఏడు ఆరు తాళంచెవుల వలన 25 శాతం తిరిచే అవకాశంవుంది. మొట్టమొదటి తాళం చెవి వలన ఎన్నడూ బీరువా తలుపు తెరవటం సాధ్యంకాదు. దీనిని స్టాటిస్టిక్సులో బంకం సూత్రం అంటారు.

మాట వరుసకి మీరు రుబ్బురోలు మారుస్తుండగా అది దొర్లి మీ ఎడమ బొటనవేలు చితికిందనుకోండి. మీరు అమ్మోవ్ నాయనోవ్ అంటూ రష్యన్ పద్ధతిలో కాసేపుఏడ్చి తరువాత కుంటు కుంటూ యింట్లోఎలాగూ తిరక్క తప్పదు కదా! అప్పుడు మీ పిల్లలో, మీ పొరుగువారి పిల్లలో మీ వారో ఎవరో ఒకరు అస్తమానూ మీ ఎడమకాలి బొటన వ్రేలిమీద తొక్కిమీకు ప్రాణం జిల్లార్చుకుపోయే బాధ కలిగిస్తారు. మీరు మామూలుగా వున్నపుడు మీకాలిమీద ఎవరూ అడుగేయరు. వేసినా ఏ కాలిమీద వేస్తారనేది సమస్యకాదు. ఎప్పుడైతే మీ బొటనవ్రేలు చితికిందో అప్పటి నుంచి "తగిలిన వ్రేలుకే తగుల్తుంది" అన్నట్లు మీ ఎడమకాలి బొటన వ్రేలు డేంజర్లో పడిపోతుంది. గడపలు గుమ్మాలు చిన్నచిన్న రాళ్ళు అన్ని దానికే తగుల్తాయి. కుడి బొటన వ్రేలికంటె పచ్చడయిన ఎడమ బొటనవ్రేలు ప్రమాదాల్ని యిట్లే ఆకర్షిస్తుంది. అంటే పాత స్టాటిస్టిక్స్ అనగా ప్రమాదం రెండు బొటన వ్రేళ్ళకీ సమానమనే సూత్రం పనిచేయదు. తగిలిన వ్రేలుకే తగలటం అనేది బంకం సూత్రమని పారక్స్ తెలుసుకోవాలి.

మానవనైజం ప్రవర్తన అసాధారణమైన పరిస్థితుల్లో మారి పోతుంది. దీనిమీద ఎవరైనా నవల వ్రాయచ్చు.

'సంభవామి యుగే యుగే' అని వుందనుకోండి ధర్మ సంస్థాపనార్థాయ అనేది మనం కలిపి చదువుకోవాలి. అంటే అధర్మం, దుర్మార్గం, విజృంభించి మంచికి హాని కలుగుతున్నపుడు నేను వచ్చి కలగ చేసుకుంటాను అని భగవానుడు చెప్పాడని గీత అంటున్నది. సరే అలాక్కానివ్వండి అంటే సాధారణ పరిస్థితుల్లో భగవంతుడు కలగ చేసుకోడనే కదా తాత్పర్యం. ఈ బంకం ప్రిన్సిపుల్ప్ర కారమే దేవుడుగాని దేవుని కుమారుడుకాని మనల నుద్ధరించడం కోసం రావటం జరుగుతుంది. ఈలోగా రోజూ టెంకాయలు కొట్టినా, తప్పెట్లూ, తాళాలూ మ్రోగించినా హరికథల్చెప్పినా, నోములూ, వ్రతాలూ, పూజలూ, పురస్కారాలూ చేసినా దేవుడు వినిపించుకోడు. అతడు బంకం ప్రిన్సిపుల్ప్రకారం వస్తాడు కాని భక్తుల మొర వినిమాత్రంరాడు.

బంకం ప్రిన్సిపుల్ని సింపులాతి సింపులుగా మనవి చేస్తాను. లేడీస్లారా, సిస్టరీ మణులారా, చెవి యొగ్గి వినుడు.

మీరు రోజూ వంటచేస్తారు, అప్పుడప్పుడు కోపం వస్తే వంటా గింటా, జంతానై అంటారు. అది బంకం ప్రిన్సిపులే – రోజూ మీ వారు మిమ్మల్ని ముద్దు చేస్తారు. అప్పుడప్పుడు అట్టు తిరగేస్తూ వుంటారు. అది బంకం ప్రిన్సిపులే –

పక్కింటి మీనాక్షమ్మతో మీరు చాలా స్నేహంగా వుంటారా? ఆవిడ తమ్ముడొకడు మినీకీచకుడు మీకేసి సైరంధ్రిని చూసినట్లు చూస్తూంటాడనుకోండి అప్పుడు మీరు పక్కింటి మీనాక్షమ్మతో కత్తియుద్ధం ప్రారంభిస్తారు వుత్తి పుణ్యానికి. ఇదీ బంకం ప్రిన్సిపులే.

మీ గృహ రాక్షసుడిని పెందరాళే రమ్మని పిక్చర్ ప్రోగ్రాం వేస్తారు. అతగాడికి ఆ సాయంత్రమే ఆఫీసులో పై అధికారి నుంచి సహస్ర ఘటాభిషేకం జరిగి కుంయ్ కంయ్ మనకుండా పీకల మీద కత్తి లాటి పనిలో మునిగిపోయి మీ ప్రోగ్రాం మాట మర్చిపోతాడు. సాధారణ పరిస్థితుల్లో అతను మీ ముద్దు తప్పక చెల్లిస్తాడు. ఇటువంటప్పుడు డామిట్, రాస్కేల్, గూస్ అంటాడు. ఇక్కడ బంకం ప్రిన్సిపుల్ వర్తిస్తుందన్న మాట.

మీ అమ్మగారు ఆవకాయ జాడీలు, మామిడి పళ్ళ బుట్ట, అప్పడాలు, ఒడియాల్తో వస్తూన్నదని ఉత్తరం రాగానే మీవారిని స్టేషను కెళ్ళమని మీరు ముద్దుగా బ్రతిమాలి మర్చిపోవద్దని సాయంత్రం సర్కార్ ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళి తీరాలని ఎమర్జెన్సీ డిక్లేరు చేస్తారు.

మీ వారు పెద్ద స్టేషనుకి బయలుదేరాలని అనుకుంటూ వుండగా వారికి, అక్కడ ఆఫీసులో....

– ఒక అర్జెంటు ఉత్తరం మీద చర్య తక్షణం తీసుకోవలసి రావచ్చు.

....పై అధికారి మీ వారిని మాట్లాడటానికి పిలవవచ్చు.

– ట్రంక్ కాల్ రావచ్చు.

మీ కొకవేళ కారుంటే కారు డ్రైవరు కాల కృత్యాలు తీర్చుకోడానికి వెళ్ళి వుండచ్చు.

– అసలు కారులో పెట్రోలు తగ్గిపోయి వుండవచ్చు. తీరా పెద్ద స్టేషనుకు మీవారు బయల్దేరారనుకోండి. అప్పుడు కూడా –

కారుగాని, రిక్షాగాని, స్కూటర్‌గాని చెడిపోవచ్చు. రిక్షా టైర్లు పంచరు పడవచ్చు. చైను తెగిపోవచ్చు.

– లేదా మీవారు రోడ్డు ప్రమాదంలో యిరుక్కుపోయి వుండవచ్చు.

దారిలో పెద్ద అమ్మవారి వూరేగింపు వెనక్కాల మీవారి వాహనం చిక్కుకొనిపోయి వుండవచ్చు.

– ట్రాఫిక్ జాం రావచ్చు.

తరువాత మీవారు ఐదు పది నిముషాలు ఆలస్యంగా పెద్ద స్టేషనుకు వచ్చారనుకోండి. అప్పుడు–

అంత క్రితమే రైలు వచ్చి పావుగంట దాటి వుండవచ్చు.

లేదా మీవారు వెళ్లగానే రైలు రావచ్చు.

లేదా రైలు పావుగంట అరగంట లేటుగా రావచ్చు.

(ఒకవేళ మీరు సరిగా చూడకపోతే ఉత్తరం ఆ రైలు మర్నాడు రావలసినది కావచ్చు.) దీన్ని బంకం ప్రిన్సిపులు ప్రకారం పరిశీలిస్తే అసాధారణ పరిస్థితుల్లో సాధారణ సూత్రాలు

పని చేయవని తెలుస్తుంది. బంకం సూత్రం మీద పరిశోధన చేసి రైటర్స్ బంకం కథలూ, బంకం నవలలూ, సినిమా వారు బంకం సినిమాలు తీయవచ్చు.

(కలకత్తా ఆంధ్ర సంఘంవారి 1970 సూవెనీర్ లోని శ్రీషారు యస్. రంగ్నేకర్ వ్యాసం చదివి వ్రాసింది.)

# గృహడైనమిక్స్

పిల్లలు ఎదిగివచ్చేసరికి, ప్రతి స్త్రీకి వైవాహిక జీవితం మోయ లేని భారం కావటం సహజం. గృహిణికి ప్రతిరోజూ ఒక గడ్డు సమస్యగా తయారవుతుంది. ముదరగా ముదరగా "టెన్షన్", కుండ బ్రద్దలయినట్లు ఆవిడగారి మనసు ఏదో ఒకరోజు బ్రద్దలయి యేకాకిగా చికాకుగా వుండి చింతావారి అమ్మాయి అయిపోతుంది. ఏడ్చినా, కోసం తెచ్చుకొని అరచినా కోతిలా గంతులు వేసినా, అది తగ్గదుకాక తగ్గదు.

ఇది గృహ ప్రళయం అవొచ్చు. ప్రతి యింట్లోనూ ఏవో గొడవ లుంటాయి. చీకాకు లుంటాయి. మనశ్శాంతి కరువవుతుంది. ఈ పరిస్థితిని ఏమీ పట్టించుగోకుండా తిరిగే మగపురుషులుంటారు. ఇలాంటి ఇల్లాళ్ళ బాధలను కథలుగా వ్రాసి నాలుగు డబ్బులుచేసుకోవాలనే షార్టు స్టోరీ రైటర్సుంటారు. కాని ముళ్ళపొదలో గళ్ళచీరలా వున్న ఇల్లాలి జీవితంలోకి తొంగిచూసి నాలుగు మంచి మాటలు చెప్పి లాలించి, ఆవిడ సేద దీర్చే మంచివాళ్ళు చాలా తక్కువగా వుంటారు. పొరుగింటి మీనాక్షమ్మలు మన్నోకంట కనిపెడ్తూ నవ్వుకుంటూంటారు. తమదాకా వస్తే కాని వారికీ తెలీదు. ఎదటివారి జీవితంలోని లోట్లు మనకు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి కాని గురవిందగింజ తన క్రింద నలుపు తెలుసుకోలేదు గదా!

మనం వుండే ఇళ్ళు ఎలాంటివి? మురికి గోడలు, ఇరుకు గదులు, చిన్న, చిన్న వాటాలు, కామను లెట్రిన్లూ, కామను బాత్రూంలూ వుమ్మడి పంపూ - మధ్య తరగతి గృహిణికి దాచుకుందామన్నా రహస్యాలు దాగవు. లోపల ఏడ్చినా బయటకు తెలుస్తుంది. ఇంట్లోఏం జరిగినా నాలుగువూళ్ళకు తెలిసిపోతుంది! గుట్టూ మట్టూ వుండేడిస్తేనా? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. కుటుంబ జీవితంలోని రోజువారీ అవక తవకలు ఎన్నని దాచుకుంటాం. తగాదాలూ, తంపులూ, కోపాలూ, తాపాలూ, వున్నాయనీ లేవనీ యిదే కదా యేడుపు? ఈ యేడుపు దాస్తే దాగుతుందా?

ఓ అరగంట క్రితం మీరూ మీవారూ ఛడా మడా రైటండ్ లెఫ్ట్ "త్వం శుంఠ అంటే త్వం శుంఠ" అని పోట్లాడేసుకున్నా రనుకోండి. మరుక్షణంలో అది రేడియో తరంగాలై వూరంతా